## అదనపు నైపుణ్యాలతోనే మెరుగైన ఉపాధి అవకాశాలు

● సింప్లిలెర్న్ అధ్యయనంలో వెల్లడి

**హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి):** సాంకేతిక రంగంలో అదనపు నైపుణ్యాలను పొందడం ద్వారానే మెరుగైన ఉపాధి అవకాశాలు సాధ్యమని నేటి తరం భావిస్తుందని సింప్లిలెర్న్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కశ్యప్ దలాల్ తెలిపారు. 18-27 సంవత్సరాల వయసు కలిగిన జెన్ జెడ్ తరాన్ని సింప్లిలెర్న్ సంస్థ అధ్యయనం చేసింది. ఈ వివరాలను సింప్లిలెర్న్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కశ్యప్ దలాల్ తెలిపారు. మన దేశంలో యువతకు నైపుణ్యం మెరుగుపరచడం ద్వారా దాదాపు 10కోట్ల మందిని వర్క్‌ఫోర్స్‌లోకి తీసుకురావచ్చని తెలిపారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఇది దోహదపడుతుందని, 2030 నాటికి అంతర్జాతీయంగా వర్క్‌ఫోర్స్‌లో 30% జెన్ జెడ్ ఉంటుందని పేర్కొన్నారు. సాంకేతిక పరిశ్రమలో మారుతున్న డిమాండ్‌కు అనుగుణంగా అవకాశాలను అందిపుచ్చుకోవడానికి జెన్ జెడ్ తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటుందని వివరించారు. అదనపు నైపుణ్యాలను కోరుకుంటున్న వారిలో 66% బ్యాచలర్ డిగ్రీలను కలిగి ఉన్నారని తెలిపారు. దాదాపు 60% మంది అభ్యాసకులు ప్రస్తుతం ఐటీ రంగంలో ఉపాధి పొందుతుంటే, 40% మంది ఐటీయేతర రంగాలలో ఉపాధి పొందుతున్నారని, 83% మంది జెన్ జెడ్ ఉద్యోగులు మెరుగైన ఉద్యోగావకాశాలు పొందడానికి అదనపు నైపుణ్యాలను పొందాలని గట్టిగా కోరుకుంటున్నారని వెల్లడించారు. ఇలా కోరుకునే వారిలో బిజినెస్ ఎనలిటిక్స్‌ను 35.3% కోరుకుంటుంటే, ఏఐ, మెషీన్ లెర్నింగ్ టూల్స్ అభ్యసించాలని 33.9%, సైబర్ సెక్యూరిటీని 20.2% కోరుకుంటున్నారని ఆయన వివరించారు.



బెంచ్ ప్రెస్ కాంపిటీషన్ విజేతలకు పతకాలు అందజేసిన రమేష్‌గౌడ్

## పవర్ లిఫ్టింగ్ విజేతలకు పతకాలు

**హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి):** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలానగర్ రాజుకాలనీలో రెండు రోజుల పాటు బెంచ్ ప్రెస్ కాంపిటీషన్ నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ నుంచి క్రీడాకారులు పాల్గొని పలు విభాగాల్లో విజేతలుగా నిలిచారు. విజేతలకు పతకాలను తెలంగాణ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్తపల్లి రమేష్‌గౌడ్ అందజేశారు. విశాల్ యాదవ్ సబ్ జూనియర్ 53 కిలోలు, సోను జూనియర్ 53 కిలోలు, మనోజ్ కుమార్ జూనియర్ 59కిలోలు, నిఖిల్‌రెడ్డి సబ్ జూనియర్ 74 కిలోలు, రాజ్ కుమార్ సీనియర్ 83 కిలోలు, శ్రీశాంత్ సబ్ జూనియర్ 83 కిలోలు, బొడ్డు మనీష్‌గౌడ్ సబ్ జూనియర్ 93 కిలోలు, ప్రదీప్ సీనియర్ 53 కిలోలు, జగదీశ్ జూనియర్ 53 కిలోలు, అసీమ పట్నాయక్ సీనియర్ 55 కిలోలు, నాగజ్యోతి సీనియర్ 65 కిలోలు, మాస్టర్స్ కేటగిరిలో సీఆర్ మిశ్రాజి 66 కిలోల విజేతలకు పతకాలను అందజేశారు.

## అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

**పంజాగుట్ట, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి):** ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ బి.రాజేంద్రకుమార్ తెలిపారు. ఇంగ్లిష్, బీబీఏ, టాక్సేషన్, డేటా సైన్స్, స్టాటిస్టిక్స్, మైక్రోబయాలజి, కంప్యూటర్ అప్లికేషన్స్‌లో ఖాళీలు ఉన్నాయని, అభ్యర్థులు ఈనెల 5వ తేదీలోపు చింతలబస్తీలోని ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని సూచించారు. 6న కళాశాలలోనే ఇంటర్వ్యూ ఉంటుందని, అభ్యర్థులు సంబంధిత సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

## చిట్యాల ఐలమ్మ ప్రజా సంక్షేమ సంఘం ఆవిర్భావం

**రాంనగర్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి):** ప్రపంచానికి తెలంగాణ సాయుధ పోరాట పాఠాన్ని నేర్పిన వీరనారి చిట్యాల ఐలమ్మ ఆశయాన్ని ముందుకు తీసుకెళ్లడం కోసం సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, ఐలమ్మ మనవడు చిట్యాల రామచంద్రం, అధ్యక్షురాలు చిట్యాల శ్వేత ఆధ్వర్యంలో ఐలమ్మ ప్రజా సంక్షేమ సంఘం ఆవిర్భవించింది. ఈ సందర్భంగా మంగళవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సమావేశం జరిగింది. ముఖ్యఅతిథి సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి ఐలమ్మ చేసిన పోరాటాన్ని వివరించారు. ప్రభంజన్‌యాదవ్, తెలంగాణ ప్రజా సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, రజక అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు నర్సింహులు మాట్లాడుతూ ఐలమ్మ విగ్రహాన్ని, రజక కార్పొరేషన్, రజక భవనాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా విశ్వవిద్యాలయానికి ఐలమ్మ పేరు పెట్టాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పోశెట్టి ఉపేందర్, కృష్ణ, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## హైడ్రా పేరుతో రూ.20 లక్షలు డిమాండ్

● సోషల్‌వర్కర్ పేరుతో ఫిర్యాదుల దందా
● హైడ్రా కమిషనర్, మంత్రులతో దిగిన ఫొటోలతో బెదిరింపులు
● బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు



డాక్టర్ విప్లవ్‌సిన్హా

**పటాన్‌చెరు, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి):** సోషల్ వర్కర్ ముసుగులో హైడ్రా పేరు చెప్పి రూ. 20 లక్షలు ఇవ్వాలని బిల్డర్లను డిమాండ్ చేసిన వ్యక్తిపై అమీన్‌పూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో సాయివిల్లాస్ రోడ్డులో ఎంసీఆర్‌ఓ ప్రాజెక్ట్ పేరుతో జూబ్లీహిల్స్‌కు చెందిన బిల్డర్లు వాడల రాజేంద్రనాథ్, మంజునాథ్‌రెడ్డి అపార్ట్‌మెంట్ నిర్మిస్తున్నారు. అన్ని రకాల అనుమతులు ఉన్నప్పటికీ, అపార్ట్‌మెంట్ పెద్ద చెరువు నాలా బఫర్‌జోన్ పరిధిలోకి వస్తుందని, అదే కాలనీలో అద్దెకు ఉండే ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ బండ్ల విప్లవ్‌సిన్హా కొంతకాలంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. ఫ్లాట్లు చూసేందుకు వచ్చే కస్టమర్లకు తప్పుడు సమాచారం ఇస్తున్నాడు. సామాజిక కార్యకర్తగా చెప్పుకునే ఆయన పలు ప్రభుత్వ శాఖలకు పదేపదే ఫిర్యాదులు చేస్తున్నాడు. ఇటీవల ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రాను అడ్డం పెట్టుకుని పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేయడం ప్రారంభించాడు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ పలు మార్లు అమీన్‌పూర్‌లో పర్యటించిన సందర్భంలో రంచన్‌గా ప్రత్యక్షమై ఆయనతో ఫొటోలు తీయించుకున్నాడు. గత నెలలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ వచ్చిన మరుసటి రోజు బిల్డర్లు రాజేంద్రనాథ్‌రెడ్డి, మంజునాథ్‌రెడ్డిలను అశోక్‌నగర్ పిస్తా హౌజ్ వద్దకు పిలిపించి, తనకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ చాలా దగ్గర అని ఫొటోలు చూపించి బెదిరించాడు. అపార్ట్‌మెంట్ కూల్చకుండా ఉండాలంటే తనకు రూ.20 లక్షలు ముట్టచెప్పాలని లేదంటే, పత్రికల్లో వార్తలు రాయించి కూల్చివేయిస్తానన్నాడు. మరోమారు గచ్చిబౌలి ఆఫ్రికన్ కాఫీ హౌజ్ వద్దకు పిలిపించి తక్షణం ఎంతోకొంత డబ్బు ఇవ్వాలని, లేదంటే కూల్చడం ఖాయమని తీవ్రంగా బెదిరించాడు. హైడ్రా కమిషనర్‌తో పాటు గతంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర రాజనర్సింహతో దిగిన ఫొటోలను చూపించి బ్లాక్‌మెయిల్ చేయడంతో బిల్డర్లు కంగుతిన్నారు. ఇతడి వేధింపులు భరించలేక బాధితులు అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అమీన్‌పూర్ ఎస్ఐ టి.విజయరావు తెలిపారు.

## శుభకార్యానికి వెళ్లొచ్చే సరికి రూ. 14 లక్షలు చోరీ

**జీడిమెట్ల, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి):** శుభకార్యానికి వెళ్లివచ్చేసరికి దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి రూ. 14 లక్షల చోరీ చేశారు. జీడిమెట్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన హనుమాన్‌రామ్ కుత్బుల్లాపూర్ గ్రామంలో స్టీల్ దుకాణం నిర్వహిస్తున్నాడు. దుకాణం పై అంతస్తులో నివసిస్తున్నాడు. గత శనివారం బెంగళూరులో ఉంటున్న సోదరి ఇంట్లో శుభకార్యానికి కుటుంబ సమేతంగా వెళ్లాడు. మంగళవారం ఇంటికి తిరిగి రాగా తాళాలు పగలగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో భద్రపరిచిన రూ. 14 లక్షలు కనిపించలేదు. చోరీ అయ్యాయని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

**పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడుస్తున్నా విద్యారంగ సమస్యలను పరిష్కరించడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టి పెట్టడడం లేదని ఏబీవీపీ మేడ్చల్ జిల్లా కన్వీనర్ నగేష్ ఆరోపించారు. చింతల్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు రాలేదని, యువత ఉద్యోగాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే సెక్రటేరియట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో మృత్యుంజయ, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న యువత



సమావేశంలో ఉత్సవ కమిటీ అడ్‌హక్ సభ్యులు

# గణేశ్ ఉత్సవాల్లో యువతకు ప్రాధాన్యం

**ఖైరతాబాద్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి):** ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవాల్లో తమను భాగస్వాములను చేయాలని ఖైరతాబాద్ యువత డిమాండ్ చేసింది. స్థానిక పాత దూద్‌ఖానా కమ్యూనిటీహాల్లో అడ్‌హక్ కమిటీ ప్రతినిధులతో యువత ప్రత్యేకంగా సమావేశమై పలు అంశాలపై చర్చించారు. గణేశ్ ఉత్సవాల ప్రతినిధులు సింగరి రాజ్‌కుమార్, మహేందర్‌బాబు, మహేష్‌యాదవ్, దాసు, బాల్‌కుమార్ తదితరులు తప్పకుండా యువతకు తగిన ప్రాధాన్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

### రేపు యూత్ ఆధ్వర్యంలో 'ఆగమన్'

ఖైరతాబాద్ గణపతి ఉత్సవాల 70 సంవత్సరాల చరిత్రలో తొలిసారిగా గణపతి 'ఆగమన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గణపతికి నేత్రోన్మీలనం జరిగే 5వ తేదీన ఖైరతాబాద్ యూత్ ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు యువజన విభాగం నేతలు పేర్కొన్నారు. గణపతి సిద్ధమైన సందర్భంగా ఆయనను పూజకు ఆహ్వానిస్తూ ఈ ఆగమన్ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో యువజన నాయకులు దీపు, చక్రి, అంబటి కళ్యాణ్, నర్సింగ్, శ్రీను, చిన్న మనోజ్, కిరణ్, అప్పు తదితరులు పాల్గొన్నారు.

### పోస్టర్ ఆవిష్కరణ

**పంజాగుట్ట, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి):** ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో వృక్షశాస్త్ర విభాగం, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో 'మట్టి గణపతే-మహా గణపతి'పై విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. మట్టి గణపతిని పూజించాలని తెలిపే పోస్టర్‌ను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. మట్టి గణపతి విగ్రహాల ప్రతిష్ట వల్ల కలిగే ప్రయోజనాలు, ప్రాముఖ్యతను కాలుష్య నియంత్రణ మండలి సీనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ బి.నాగేశ్వరరావు వివరించారు. మట్టి గణపతులను పూజించేలా విద్యార్థులు అవగాహన కల్పించాలని సూచించారు. విభూతి బ్రదర్స్ కల్చర్ సొసైటీ అధ్యక్షుడు వి.ప్రశాంత్ బృందం వారు కళా ప్రదర్శన ద్వారా మట్టి వినాయకుల విశిష్టత గురించి తెలిపారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రాజేంద్ర కుమార్, వృక్షశాస్త్ర విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ కృష్ణ మోహన్, డాక్టర్ ఎస్.హరికృష్ణ, డాక్టర్ జి.శ్రీను, డాక్టర్ వి.ప్రభాకర్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



వెంకయ్యనాయుడుకు మట్టి గణపతిని అందజేస్తున్న వాసవీ యువజన సేవా ప్రతినిధులు

## మట్టిగణపతులను ప్రతిష్ఠించాలి

● మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

**యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి):** అందరూ మట్టిగణపతులను ప్రతిష్ఠించాలని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు విజ్ఞప్తి చేశారు. కృష్ణనగర్ వాసవీ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో మట్టిగణపతుల పంపిణీని మంగళవారం ప్రారంభించారు. మొదటి విగ్రహాన్ని వెంకయ్యనాయుడుకు అందజేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పుట్టా రామకృష్ణ, అట్లూరి రామకృష్ణ, సూర్యారావు, పుట్టా బుజ్జి, నవీన్ పాల్గొన్నారు.



మట్టి వినాయక విగ్రహాలపై అవగాహన కల్పిస్తున్న విభూతి బ్రదర్స్ వి.ప్రశాంత్ కళాజాత బృందం

## మట్టి వినాయకులపై అవగాహన

**పంజాగుట్ట, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి):** తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో విభూతి బ్రదర్స్ వి.ప్రశాంత్ కళాజాత బృందం ద్వారా మట్టి వినాయక విగ్రహాల ప్రతిష్టాపనపై కోఠి బస్టాప్ లో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని, చెరువులను పరిరక్షించాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని కళాజాత ద్వారా ప్రజలకు వివరించారు.

# కాంగ్రెస్ దాడులు హేయం : బీఆర్ఎస్



మాట్లాడుతున్న మన్నె గోవర్ధన్‌రెడ్డి తదితరులు

**బంజారాహిల్స్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి):** కష్టాల్లో ఉన్న ప్రజలకు సహాయం చేసేందుకు వెళ్తే కాంగ్రెస్ నాయకులు దాడులు చేయడం హేయమైన చర్య అని బీఆర్ఎస్ ఖైరతాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఖమ్మంలో మాజీ మంత్రులు హరీష్ రావు, పువ్వాడ అజయ్, సబితారెడ్డి, జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు వాహనాలపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేయడాన్ని ఆయన ఖండించారు. బంజారాహిల్స్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఎవరెన్ని దాడులు చేసినా ప్రజల వద్దకు బీఆర్ఎస్ శ్రేణులు వెళ్లకుండా ఆపలేరన్నారు. కాంగ్రెస్ చేతగాని పాలనను ప్రజలు గమనిస్తున్నారని, సమయం వచ్చినప్పుడు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

### దాడి సిగ్గుచేటు : మాగంటి

ఖమ్మం వరద బాధితులకు సాయం చేసేందుకు వెళ్లిన బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ కార్యకర్తల దాడిని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్ నేతలు వరద ప్రాంతాల్లో నిత్యావసరాలు పంపిణీ చేస్తుంటే కాంగ్రెస్ గుండాలు దాడి చేయడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. దాడికి పాల్పడ్డ వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్నప్పుడు వరదల కారణంగా నష్టపోయిన పంటలకు ఎకరానికి రూ.30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు ఎకరాకు రూ.10 వేలు ఇస్తామని ప్రకటన చేయడం ఏంటని ప్రశ్నించారు.

# వరద బాధితులను ఆదుకునేందుకు బీజేపీ సిద్ధం

● మాజీ ఎమ్మెల్యే చింతల

**బంజారాహిల్స్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి):** వరద బాధితులను ఆదుకునేందుకు బీజేపీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. బంజారాహిల్స్ రోడ్డునంబర్.2లోని క్యాంపు కార్యాలయంలో బీజేపీ ముఖ్యనేతలతో ఆయన మంగళవారం సమావేశమయ్యారు. అకాల వర్షాల కారణంగా అనేక ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నారని, వారికి భరోసా ఇచ్చేలా ఆయా జిల్లా బీజేపీ నాయకులు పనిచేస్తున్నారని గుర్తు చేశారు. అవసరమైతే నగర నాయకులు ఖమ్మం, నల్గొండ, కామారెడ్డి జిల్లాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని చెప్పారు. సమావేశంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల

## రెడ్ క్రాస్ ద్వారా సహాయం



మాట్లాడుతున్న రెడ్ క్రాస్ యూత్ కన్వీనర్ మణిదీప్

**బంజారాహిల్స్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి):** తెలుగు రాష్ట్రాల్లో వరద బాధితులకు రెడ్‌క్రాస్ ద్వారా సహాయం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు యూత్ కన్వీనర్ మణిదీప్ తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని సంస్థ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే తమ సంస్థ ప్రతినిధులు పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ తాగునీరు, బిస్కెట్లు, ఆహార పొట్లాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఖమ్మం, వరంగల్, నల్గొండ, విజయవాడలో ఉన్న విద్యార్థులకు రెండు లక్షల నోట్ పుస్తకాలు, స్టేషనరీ సిద్ధం చేసినట్లు చెప్పారు. మానవతా దృక్పథంతో సహాయం అందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో హైదరాబాద్ రెడ్ క్రాస్ ఛైర్మన్ మామిడి భీమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వలసవాద దోపిడీ నుంచి అభివృద్ధి వైపు..

**బేగంపేట, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి):** బేగంపేటలోని సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాలలో వికసిత్ భారత్ 2047ను సాధించడంలో ఉన్నత విద్యాసంస్థల పాత్ర అనే అంశంపై ఐసీఎస్ఎస్ఆర్ ఆధ్వర్యంలో రెండు రోజుల సెమినార్ మంగళవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ జె.మాథ్యూ జార్జ్, ముఖ్యవక్తగా ప్రొఫెసర్ సి.గణేష్ హాజరయ్యారు. భారతదేశంలో విద్య, ఆరోగ్య సంరక్షణ వంటి అవసరమైన సేవల స్థోమత, లభ్యత తదితర విషయాలపై ప్రొ.జె.మాథ్యూ జార్జ్ మాట్లాడారు. ఆర్థికాభివృద్ధితో పాటు సామాజిక, సాంస్కృతిక ప్రగతిని కలుపుకొని సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని ముఖ్య వక్త డాక్టర్ సి.గణేష్ సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఉమా జోసెఫ్ మాట్లాడుతూ వలసవాద దోపిడీ నుంచి అభివృద్ధి చెందుతున్న దేశంగా సాధించిన విజయాల వైపు భారతదేశం ప్రయాణాన్ని నొక్కి చెప్పారు. నగరానికి చెందిన అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, పరిశోధకులు, విద్యావేత్తలు సదస్సులో ప్రసంగించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో ప్రొ.మాథ్యూ జార్జ్, ప్రొ.గణేష్, కళాశాల ప్రిన్సిపాల్ డా. ఉమా జోసెఫ్ తదితరులు

# ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

**బంజారాహిల్స్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి):** ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పంజాగుట్ట ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ సూచించారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్.12లోని గ్లోబల్ గ్రామర్ స్కూల్‌లో మంగళవారం రైడ్ టూ సేఫ్టీ' కార్యక్రమంలో భాగంగా ట్రాక్స్ ఎన్జీవో, గ్లోబల్ గ్రామర్ స్కూల్ సంయుక్తంగా విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు హెల్మెట్లను పంపిణీ చేశారు. ఏసీపీ హరిప్రసాద్ మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, బాధ్యత లేకుండా ప్రవర్తించడం రెండూ ఒకటేనని, ప్రతీ ఒక్కరు రోడ్డు నియమాలు పాటించాల్సిందేనని అన్నారు. ట్రాక్స్ సొసైటీ ప్రాజెక్ట్ హెడ్ ఆరాధన జైన్, స్టార్స్ కో-ఆర్డినేటర్ షేక్ అక్రం, గ్లోబల్ గ్రామర్ స్కూల్ కరస్పాండెంట్ కట్టా సునీల్, ప్రిన్సిపాల్ శిరీష తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు, తల్లిదండ్రులకు హెల్మెట్లు అందజేసిన పంజాగుట్ట ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్

## సత్యసాయిలో జాతీయ చేనేత పట్టు వస్త్రప్రదర్శన



చేనేత ఉత్పత్తులతో శైలజారెడ్డి

**బంజారాహిల్స్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి):** శ్రీనగర్‌కాలనీలోని సత్య సాయి నిగమాగమంలో ఏర్పాటైన జాతీయ చేనేత పట్టు వస్త్రప్రదర్శనను మంగళవారం సామాజికవేత్త వైశైలజారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో పట్టు, హ్యాండ్‌లూమ్ వస్త్రోత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందని, ఈ ఉత్పత్తులకు నేటికీ వన్నె తగ్గలేదని అన్నారు. నేటితరం యువత కూడా హ్యాండ్‌లూమ్ ఉత్పత్తులను ఎంతో ఆదరిస్తున్నారన్నారు. నిర్వాహకుడు జయేష్ కుమార్‌గుప్తా మాట్లాడుతూ ఈనెల 11వ తేదీ వరకు కొనసాగుతున్న ప్రదర్శనలో దేశంలోని 14 రాష్ట్రాల నుంచి చేనేతకారులు, చేతిపని బృందాలు తమ సిల్క్ హ్యాండ్‌లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి 75 వేల రకాల వస్త్రోత్పత్తులను అందుబాటులో ఉంచినట్టు చెప్పారు.



క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన జీహెచ్ఎంసీ సర్కిల్-19 డిప్యూటీ కమిషనర్ జకీరా సుల్తానా
● బంజారాహిల్స్, ఆంధ్రజ్యోతి



కమ్యూనిటీహాల్ స్లాబ్ పనులను ప్రారంభిస్తున్న విజయారెడ్డి

## బీజేఆర్‌నగర్ కమ్యూనిటీహాల్ పునర్నిర్మాణం

**ఖైరతాబాద్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి):** ఖైరతాబాద్ బీజేఆర్‌నగర్‌లో పునర్నిర్మిస్తున్న కమ్యూనిటీహాల్ స్లాబ్ పనులను కార్పొరేటర్ విజయారెడ్డి మంగళవారం ప్రారంభించారు. నాణ్యతతో పనులు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎస్‌కె.షరీఫ్, అధికారులు పాల్గొన్నారు.




పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జమాతే ఇస్లామీ హింద్ మహిళా విభాగం ప్రతినిధులు

## నైతికత, స్వేచ్ఛపై అవగాహన

**పంజాగుట్ట, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి):** దేశంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న హింసాత్మక ఘటనలకు సమాజంలో నైతిక విలువలు లోపించడమే కారణమని జమాతే ఇస్లామీ హింద్ మహిళా విభాగం ఆందోళన వ్యక్తం చేసింది. నైతిక విలువలను పెంపొందించేందుకు నెల రోజులపాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు క్యాంపెయిన్ కన్వీనర్ డాక్టర్ అస్రా ముహ్సినా తెలిపారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రచారానికి సంబంధించిన పోస్టర్‌ను మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖతీజా మెహ్వీన్, ప్రతినిధులు సాజిదాబేగం, ఇష్రత్ భానుతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, జన సమూహాలు అధికంగా ఉండే ప్రదేశాల్లో 'నైతికతే నిజమైన స్వేచ్ఛ' అనే అంశంపై నెల రోజుల పాటు అవగాహన, ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.



అక్క మహాకాళి మహిళా కురుమ సంఘం సభ్యులను అభినందిస్తున్న రెహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

## అక్క మహాంకాళి మహిళా కురుమ సంఘం ఏర్పాటు

**యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి):** మహిళలంతా ఐక్యంగా సంఘం ఏర్పాటు చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని రెహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మహిళలు అక్క మహాకాళి మహిళా కురుమ సంఘం ఏర్పాటు చేసుకున్నారు. అనంతరం కార్పొరేటర్‌ను కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షురాలు పి.అన్నపూర్ణ, ఉపాధ్యక్షురాలు కె.అనిత, ప్రధాన కార్యదర్శి శ్రావణిని సీఎన్ రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు జె.రజిత, కె.రాధ, ఎం.అంజలి, సుజాత, అనూష, రాజేశ్వరి, సరోజిని, చేగూరి పుష్ప పాల్గొన్నారు.

## ఆభరణాలు తీసుకుని డబ్బు ఎగవేత

**బంజారాహిల్స్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి):** లక్షల రూపాయలు విలువ చేసే ఆభరణాలు తీసుకొని డబ్బు ఇవ్వకుండా ఇల్లు కూడా ఖాళీ చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్.2లోని తిబారుమల్ జువెల్స్ ప్రతినిధి సందీప్ అగర్వాల్‌కు కొద్ది రోజుల క్రితం ఓ వ్యక్తి ఫోన్ చేసి దుకాణానికి వచ్చే వినియోగదారుల పేర్లు చెప్పాడు. అనంతరం తనకు నగలు కావాలని డిజైన్‌లను వాట్సాప్‌లో పంపించాలని కోరారు. సందీప్ కొన్ని ఫొటోలు పంపాడు. వాటిలో గోల్డ్ కాయిన్ హారం, లక్ష్మీపికాక్ రూబీ హారం, నక్షీ నక్లెస్‌ను ఎంపిక చేసుకున్నాడు. వీటి విలువ రూ.29.35 లక్షలు. తాను ఉంటున్న నార్సింగ్‌లోని రాజ్ పుష్పా ఎటెర్నియా విల్లాకు నగలు పంపిస్తే చెక్కు ఇస్తానని చెప్పాడు. ఈ మేరకు సందీప్ నగలు పంపించగా రెండు చెక్కులు ఇచ్చాడు. మరుసటి రోజు సదరు వ్యక్తి ఫోన్ చేసి బ్యాంక్‌లో బ్యాలెన్స్ లేదు. రెండు రోజులు ఆగిన తర్వాత జమ చేయాలని సూచించారు. ఇలా వాయిదా వేస్తూ చివరకు ఫోన్ పనిచేయలేదు. అనుమానం వచ్చి రాజ్ పుష్పా ఎటెర్నియాకు వెళ్లి వాకబు చేయగా అక్కడ విల్లాను ఖాళీ చేసినట్టు తేలింది. మోసపోయినట్టు గ్రహించిన సందీప్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పబ్ వద్ద పార్కింగ్ చేసిన బుల్లెట్ మాయం

**బంజారాహిల్స్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి):** పబ్ వద్ద పార్కింగ్ చేసిన బుల్లెట్ కనిపించకుండా పోయింది. సుచిత్ర ప్రాంతానికి చెందిన ఆనంద్ బాబీలాన్ పబ్ వద్ద వ్యాలెట్ పార్కింగ్ ఇన్‌చార్జీగా పనిచేస్తున్నాడు. ఈనెల 2న విధులకు హాజరయ్యేందుకు బుల్లెట్ వాహనంపై పబ్‌కు వచ్చాడు. పార్కింగ్‌లో వాహనం పెట్టి పనిలో నిమగ్నమయ్యాడు. కొద్దిసేపటి తర్వాత చూసేసరికి వాహనం కనిపించలేదు. జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఇద్దరి అదృశ్యం



సరస్వతి

**ఖైరతాబాద్/యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి):** వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు అదృశ్యమయ్యారు. పోలీసులు కేసులు దర్యాప్తు చేస్తున్నారు. ఖైరతాబాద్ ఇందిరానగర్‌కాలనీకి చెందిన ప్రభాకర్, సరస్వతి భార్యాభర్తలు. ప్రభాకర్ విశ్రాంత ఉద్యోగి. సరస్వతి యశోద ఆస్పత్రిలో పనిచేస్తుంది. ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు ఆడబిడ్డ దగ్గరికి వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదు. దీంతో ప్రభాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే, మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో పరిధిలో నివాసం ఉండే హన్మకొండకు చెందిన ఎస్.మణికృష్ణ నగరంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో విధులు నిర్వహిస్తున్నాడు. ఈ ఏడాది ఏప్రిల్‌లో అతడికి వివాహం అయింది. భార్య నాంపల్లిలోని ఓ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతుంది. నెల రోజుల క్రితం రెహ్మత్‌నగర్‌లో కాపురం పెట్టారు. సోమవారం మణికృష్ణ విధులకు వెళ్లాడు. ఆమె కళాశాలకు వెళ్లింది. ఇంటికి తిరిగి రాలేదు. దీంతో మణికృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | ఎం.డి. రఫీక్ : 99854 00084, జి.అంజయ్య: 9985921364



బొల్లారం రిసాల బజార్ చెక్‌పోస్ట్ వద్ద కూలిన చెట్టును తొలగిస్తున్న సిబ్బంది

## బొల్లారంలో కూలిన చెట్టు

తిరుమలగిరి సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు తిరుమలగిరి బొల్లారంలోని పలు ప్రాంతాల్లో చెట్లు కూలడంతో పాటు రోడ్లు కూడా దెబ్బ తిన్నాయి. బొల్లారం పరిసర ప్రాంతాల్లో భారీ వర్షానికి 4-5 చెట్లు కూలిపోయాయి. మంగళవారం ఉదయం బొల్లారం రిసాల బజార్ చెక్‌పోస్ట్ వద్ద ఓ భారీ వృక్షం కూలి మిలిటరీ క్వార్టర్స్ మీద పడింది. అందులో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. విషయం తెలుసుకున్న కంటోన్మెంట్ అధికారులు తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని సిబ్బందితో చెట్టును తొలగించారు.



సీతాఫల్‌మండి దేడ్‌లాక్ భవనం వద్ద పేరుకుపోయిన చెత్త

## దేడ్‌లాక్ భవనం వద్ద చెత్తను తొలగించాలి

బౌద్ధనగర్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి దేడ్‌లాక్ భవనం వద్ద ప్రతిరోజు చెత్తను వేయటంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోయారు. మ్యాన్‌హోల్స్ లీకై మురికినీరు చెత్తలోకి చేరి దుర్వాసన రావటంతో పాటు దోమలు విపరీతంగా వ్యాప్తి చెందుతుందన్నాయన్నారు. పారిశుధ్య సిబ్బంది ఉదయం చెత్తను తొలగించిన కాసేపటికే చెత్తను వేయటంతో కుప్పలు, కుప్పలుగా పేరుకుపోతుందని తెలిపారు. దేడ్‌లాక్ భవనంకు కూతవేటు దూరంలో రామాలింగేశ్వరస్వామి ఆలయం, పలు విద్యాసంస్థలున్నాయి. ఈ మార్గంలోనే నిత్యం వేలాదిమంది సీతాఫల్‌మండి రైల్వేస్టేషన్‌కు రాకపోకలు సాగిస్తుంటారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే పద్మారావుగౌడ్, కార్పొరేటర్ సామల హేమ స్పందించి దేడ్‌లాక్ భవనం చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## బీసీ నేతలను పరామర్శించిన నాయకులు

అడ్డగుట్ట, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని కోరుతు గాంధీలో ఆమర నిరాహార దీక్ష చేస్తున్న బీసీ నాయకుడు సిద్దేశ్వర్‌ను మంగళవారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బీసీ కులాల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్, కేంద్ర ప్రభుత్వ బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దానకర్ణ చారి, రామరాజు, రవి కుమార్, చెన్నయ్య, పుటం పురుషోత్తం రఘురాం మద్దతు పలికారు.

- బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్, సోషల్ జస్టిస్ పార్టీ రాజు, తెలంగాణ ఇన్‌చార్జి కవి గౌడ్, జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణ, ఓబిసి జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ వేణుకుమార్, అంబేడ్కర్ ఆజాది సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు కొంగర నరహరి, ఓబీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు దానకర్ణ చారి తదితరులు బీసీ నాయకుడు సిద్దేశ్వర్‌ను పరామర్శించి మద్దతు పలికారు.

## అదనపు నైపుణ్యాలతో మెరుగైన ఉపాధి అవకాశాలు

- సింప్లీలెర్న్ అధ్యయనంలో వెల్లడి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక రంగంలో అదనపు నైపుణ్యాలను పొందడం ద్వారానే మెరుగైన ఉపాధి అవకాశాలు సాధ్యమని నేటి తరం భావిస్తుందని సింప్లీలెర్న్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కశ్యప్ దలాల్ తెలిపారు. 18-27 సంవత్సరాల వయసు కలిగిన జెన్ జెడ్ తరాన్ని సింప్లీలెర్న్ సంస్థ అధ్యయనం చేసింది. ఈ వివరాలను సింప్లీలెర్న్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కశ్యప్ దలాల్ తెలిపారు. మన దేశంలో యువతకు నైపుణ్యం మెరుగుపరచడం ద్వారా దాదాపు 10కోట్ల మందిని వర్క్‌ఫోర్స్‌లోకి తీసుకురావచ్చని తెలిపారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఇది దోహదపడుతుందని, 2030 నాటికి అంతర్జాతీయంగా వర్క్‌ఫోర్స్‌లో 30% జెన్ జెడ్ ఉంటుందని పేర్కొన్నారు. సాంకేతిక పరిశ్రమలో మారుతున్న డిమాండ్‌కు అనుగుణంగా అవకాశాలను అందిపుచ్చుకోవడానికి జెన్ జెడ్ తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటుందని వివరించారు. అదనపు నైపుణ్యాలను కోరుకుంటున్న వారిలో 66% బ్యాచులర్ డిగ్రీలను కలిగి ఉన్నారని తెలిపారు. దాదాపు 60% మంది అభ్యాసకులు ప్రస్తుతం ఐటీ రంగంలో ఉపాధి పొందుతుంటే, 40% మంది ఐటీయేతర రంగాలలో ఉపాధి పొందుతున్నారని, 83% మంది జెన్ జెడ్ ఉద్యోగులు మెరుగైన ఉద్యోగావకాశాలు పొందడానికి అదనపు నైపుణ్యాలను పొందాలని గట్టిగా కోరుకుంటున్నారని వెల్లడించారు. ఇలా కోరుకునే వారిలో బిజినెస్ ఎనలిటిక్స్‌ను 35.3% కోరుకుంటుంటే, ఏఐ, మెషీన్ లెర్నింగ్ టూల్స్ అభ్యసించాలని 33.9%, సైబర్ సెక్యూరిటీని 20.2% కోరుకుంటున్నారని ఆయన వివరించారు.



సదస్సులో ప్రొఫెసర్ మాథ్యూ జార్జ్, ప్రొఫెసర్ గణేష్, కళాశాల ప్రిన్సిపాల్ డా. ఉమా జోసెఫ్ తదితరులు

## వలసవాద దోపిడీ నుంచి అభివృద్ధి వైపు..

**బేగంపేట, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి):** వికసిత్ భారత్-2047ను సాధించడంలో ఉన్నత విద్యా సంస్థల పాత్ర అనే అంశంపై ఐసీఎస్ఎస్ఆర్ ఆధ్వర్యంలో రెండు రోజుల సెమినార్‌ను బేగంపేటలోని సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాలలో మంగళవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ జె.మాథ్యూ జార్జ్, ముఖ్యవక్తగా ప్రొఫెసర్ సి.గణేష్ పాల్గొన్నారు. భారతదేశంలో విద్య, ఆరోగ్య సంరక్షణ వంటి అవసరమైన సేవల స్థోమత, లభ్యత తదితర విషయాలపై ప్రొఫెసర్ జె.మాథ్యూ జార్జ్ మాట్లాడారు. ఆర్థికాభివృద్ధితోపాటు సామాజిక, సాంస్కృతిక ప్రగతిని కలుపుకొని సమగ్రాభివృద్ధికి కృషిచేయాలని డాక్టర్ సి.గణేష్ సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఉమా జోసెఫ్ మాట్లాడుతూ.. వలసవాద దోపిడీ నుంచి అభివృద్ధి చెందుతున్న దేశంగా సాధించిన విజయాల వైపు భారతదేశం ప్రయాణాన్ని నొక్కి చెప్పారు. నగరానికి చెందిన అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, పరిశోధకులు, విద్యావేత్తలు సదస్సులో ప్రసంగించారు. విద్యార్థులు పాల్గొన్నారు.

# గుంతలమయంగా రహదారులు

- మరమ్మతులు చేయడంలో నిర్లక్ష్యం
- జీహెచ్ఎంసీ పనితీరుపై ప్రజల ఆగ్రహం

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి):** మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు రోడ్లు గుంతమయంగా మారాయి. దీంతో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. నిత్యం వేలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ప్రధాన రహదారులను జీహెచ్ఎంసీ సిబ్బంది నామమాత్రంగా మరమ్మతులు చేపడుతున్నారు. సికింద్రాబాద్ ప్యారడైజ్ హోటల్ పరిసర రహదారులు చాలా కాలంగా అధ్వానంగా తయారయ్యాయి. ప్యారడైజ్ జంక్షన్ నుంచి అగ్రసేన్ భవన్ వెళ్లే రహదారి, చిల్లీస్ హోటల్ ఎదురుగా ఉన్న రహదారి, ప్యారడైజ్ హోటల్ వెనుక వైపు రోడ్లు గుంతలమయంగా మారాయి. నిత్యం వేలాది వాహనాలు, ప్రజలు రాకపోకలు సాగించే ఈ రహదారులకు మరమ్మతులు చేయాలని ఎన్నిసార్లు ప్రజలు మొరపెట్టుకున్నా జీహెచ్ఎంసీ బేగంపేట్ సర్కిల్ ఇంజినీరింగ్ విభాగం పట్టించుకోలేదు. తాజాగా భారీ వర్షాల కారణంగా ఈ గుంతల్లో నీరు చేరి మరింత ప్రమాదకరంగా మారాయి. జీహెచ్ఎంసీ సిబ్బంది మంగళవారం ప్యారడైజ్-అగ్రసేన్ భవన్ రహదారిలో ఒక చిన్నగుంతలో కొంత మేరకు మట్టిని నింపిన సిబ్బంది అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆ గుంతకు చుట్టూ ఉన్న మిగతా గుంతలను, పరిసరాల్లోని గుంతలను విస్మరించారు. దాంతో స్థానికులు జీహెచ్ఎంసీ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పక్కపక్కనే ఉన్న ఓ గుంతలో పైపైన మట్టిని నింపి, మరో గుంతను విడిపెట్టిన దృశ్యం



ప్రమాదకరంగా ఉన్న గుంత



పార్క్‌లేన్ జంక్షన్‌లో మూలమలుపున ఉన్న గుంతలో చేరిన వర్షపునీరు

భారీ వర్షాల వలన ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను తెలుసుకుని పరిష్కరించడానికి ముఖ్యమంత్రి, మంత్రులు, జీహెచ్ఎంసీ కమిషనర్ తదితర ఉన్నతాధికారులు రంగంలోకి దిగుతుండగా, జీహెచ్ఎంసీ బేగంపేట్ సర్కిల్ ఉన్నతాధికారులు మాత్రం తమకు ఏమీ పట్టదన్నట్టుగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ పలువురు మండిపడుతున్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ బేగంపేట్ సర్కిల్ ఉన్నతాధికారులు ప్రజాక్షేత్రంలో పర్యటించి, సమస్యలు పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

## నగరంలో నయా ట్రెండ్

- గణేశ్ ఆగమన్ పేరుతో భారీ ఉరేగింపులు

బౌద్ధనగర్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): గణేశ్ ఉత్సవాలు ప్రారంభం కాకముందే ముంబయిలో గణేశ్ ఆగమన్ పేరుతో విగ్రహాలను భారీ ర్యాలీతో మండపాలకు తరలిస్తుంటారు. అదే ట్రెండ్ ఇప్పుడు హైదరాబాద్ నగరంలో మొదలైంది. మండపాల నిర్వాహకులు లక్షలు ఖర్చుపెట్టి పదిహేను రోజుల ముందునుండే గణేశ్ విగ్రహాలను ఆగమన్ పేరుతో మండపాలకు తరలిస్తున్నారు. దీంతో వినాయకచవితి ప్రారంభం కాకముందే నగరంలో గణేశ్ ఉత్సవాల సందడి నెలకొంది. ఈ ఆగమన్‌ను తిలకించటానికి పిల్లలతో పాటు మహిళలు, పెద్దలు వేలసంఖ్యలో వస్తున్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో చిలకలగూడ, సీతాఫల్‌మండి, వారాసిగూడ, బౌద్ధనగర్ తదితర ప్రాంతాల్లో ఇప్పటికే ఆగమన్ పేరిట సుమారు వంద విగ్రహాలను మండపాలకు తరలించారు. వారాసిగూడ నేతాజీ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆగమన్ పేరుతో సుమారు పది లక్షలు ఖర్చు చేశారంటే పరిస్థితి ఎలామారిందో అర్థం చేసుకోవచ్చు. శ్రీరామ్‌సేన పేరుతో సీతాఫల్‌మండి బీజేపీ డివిజన్ అధ్యక్షుడు అంబాల రాజేశ్వరరావు సుమారు మూడు లక్షల రూపాయలతో కొనుగోలు చేసిన విగ్రహన్ని మైలార్‌గడ్డ నుంచి మేడిబావి వరకు ఆగమన్ పేరుతో భారీ ర్యాలీని నిర్వహించారు. సీతాఫల్‌మండి టీఆర్టీ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు ఆగమన్ పేరుతో సుమారు నాలుగు లక్షల రూపాయలను ఖర్చుపెట్టి వినాయకుడిన్ని మండపాన్ని తరలించారు. ఇలా చాలా మండపాల నిర్వాహకుల లక్షలు ఖర్చుపెట్టి గణేశ్ ఆగమన్ కార్యమాన్ని చేస్తున్నారు. ముంబాయి తరహాలో ముందుగా రాంనగర్‌లో ఆగమన్ నిర్వహించేవారు.

ఇప్పుడు నగరంలోని అన్నిప్రాంతాలకు ఆగమన్ వ్యాప్తి చెందటంతో నిర్వాహకులు, ప్రజలు సంతోషిస్తున్నారు. ముఖ్యంగా పిల్లలు, యువత నయా ట్రెండ్‌గా ఉన్న గణేశ్ ఆగమన్‌తో ఎంజాయ్ చేస్తున్నారు.



వారాసిగూడలో మండపానికి తరలివెళ్తుతున్న గణనాథుడు

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి: ఏసీపీ శంకర్ రాజు

బోయిన్‌పల్లి, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలని, మైనర్లు వాహనాలు నడపడం నేరమని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్ రాజు విద్యార్థులకు సూచించారు. హైదరాబాద్ కమిషనర్ శ్రీ కొత్తకోట శ్రీనివాసరెడ్డి, ట్రాఫిక్ అడిషనల్ సీపీ విశ్వప్రసాద్ ఆదేశాల మేరకు మంగళవారం బోయిన్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలు వాటి నివారణ అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఏసీపీ శంకర్‌రాజు మాట్లాడుతూ అందరూ హెల్మెట్ ధరించాలని, వాహనం వెనుక కూర్చున్న వ్యక్తి కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మోటారు వాహన చట్టంలోని సెక్షన్ 129 ప్రకారం నాలుగు సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్న ప్రతి వ్యక్తి మోటార్ సైకిల్‌పై ప్రయాణం చేయునప్పుడు బీఐఎస్ ప్రమాణాలకు అనుగుణంగా రక్షిత హెల్మెట్ ధరించాలి.

18 సంవత్సరాలలోపు పిల్లలు వాహనాలు నడపరాదని, అది చట్ట రీత్యా నేరమని తెలిపారు. రోడ్ క్రాస్ చేసేటప్పుడు జీబ్రా లైన్ వద్ద మాత్రమే క్రాస్ చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో సుమారు 85 మంది విద్యార్థులు, హెడ్ మాస్టర్ ఆర్. చాముండేశ్వరి, గౌస్ మొయినుద్దీన్, అబ్దుల్ మాజిద్, హెచ్‌జి అధికారి టీటీఐ బేగంపేట తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న టీటీఐ ఏసీపీ శంకర్ రాజు

## రైళ్ల రాకపోకల్లో జాప్యం

- ప్రయాణికుల అవస్థలు

రెజిమెంటల్‌బజార్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో రైల్వే లైన్లు దెబ్బతినడంతో పలు రైళ్లు రద్దు కాగా కొన్ని రైళ్లను ప్రత్యామ్నాయ మార్గాలలో దారి మళ్లించారు. ఆయా మార్గాల్లో నడుస్తున్న రైళ్ల రాకపోకల్లో తీవ్ర జాప్యం జరుగుతుంది. వేళకు గమ్యస్థానాలకు చేరవలసిన రైళ్లు గంటల తరబడి ఆలస్యంగా చేరుకుంటున్నాయి. ఫలితంగా ప్రయాణికులు పడుతున్న అవస్థలు పడుతున్నారు. రైళ్ల రద్దుతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వెలవెల బోయింది. స్టేషన్ పరిసర ప్రాంతాల్లో వ్యాపారాలు సైతం మందకొడిగా సాగాయి.

### మంగళవారం రద్దయిన రైళ్లు

కోనార్క్, సింహపురి, ఎస్సీ-ఎమ్‌యూజీఆర్, గోల్కొండ, శాతవాహన, చార్మినర్, విశాఖ, భాగ్యనగర్, కాకతీయ, బీదర్-ఎమ్‌టీఎమ్ ఎక్స్‌ప్రెస్‌లు రద్దు కాగా శత్రగచి స్పెషల్ రిషెడ్యూల్ చేశారు. సీఎస్ఎమ్‌టీ-బీటీఎస్ రైలు ఆలస్యంగా నడిచింది.

### ఐదు గంటలు ఆలస్యం...



మేము తిరుపతి దర్శనం వెళ్లాం .సెవెన్ హిల్స్ రైలులో సికింద్రాబాద్ రావడానికి రిజర్వేషన్ చేసుకున్నాం. వర్షాల కారణంగా రైల్వే లైన్లు పాడవడంతో ఐదు గంటలు ఆలస్యంగా రైలు నడుస్తున్నట్లు తెలిసింది. రోజు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు ఉదయం ఐదున్నర గంటలకు రావలసి ఉండగా మంగళవారం పదకొండున్నరకు చేరుకుంది. ఆలస్యం అయిన గమ్యం చేరుకున్నాం.

-రవికృష్ణ, ప్రయాణికుడు

### కర్నూల్ మీదుగా రైలు వచ్చింది



మాది కరీంనగర్ పది మందిమి తిరుపతికి వెళ్లాం. తిరుగు ప్రయాణంలో సెవెన్ హిల్స్ రైలులో సికింద్రాబాద్‌కు చేరుకున్నాం. సెవెన్ హిల్స్ రైలు రెగ్యులర్‌గా వచ్చే మార్గంలో కాకుండా కర్నూల్ మీదుగా వచ్చింది. కనుక ఆలస్యం అయింది. ఎక్కువ ఆలస్యం కాకపోవడంతో రైలులో ఇబ్బందేమి లేకుండా చేరుకున్నాం.

-రమేష్, ప్రయాణికుడు

## కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్

**తార్నాక, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి):** తెలంగాణలోని వివిధ యూనివర్సిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. తెలంగాణలోని వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు మంగళవారం డాక్టర్ ఈ.ఉపేందర్ అధ్యక్షతన ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో ప్రొఫెసర్ కోదండరామ్‌కు సన్మాన సభ ఏర్పాటు చేశారు. శాలువాలు, గజమాలలతో ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రొ. కోదండరామ్ మాట్లాడుతూ ఉద్యమాలతోనే తనకు గుర్తింపు వచ్చిందని, సామాజిక విలువలతో పని చేస్తానని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ యూనివర్సిటీలలో పని చేస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఉద్యోగ భద్రతతో పాటు యూజీసీ నిబంధనలు ప్రకారం పే స్కేల్ అమలు చేసే విధంగా కృషి చేస్తానని హామీనిచ్చారు. అనంతరం ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి మాట్లాడుతూ, విద్యావేత్త అయిన ప్రొఫెసర్ కోదండరామ్‌ను రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిగా నియమించి రాష్ట్రంలోని విద్యా వ్యవస్థతో పాటు యూనివర్సిటీలను పటిష్టం చేయాలని సూచించారు.



ఓయూలో ప్రొ కోదండ రామ్‌ను శాలువాలతో సన్మానిస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసరు

కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ జి.హరగోపాల్, టీచర్స్ ఎమ్మెల్సీ అలుగు బెల్లి నర్సిరెడ్డి, ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్ ప్రొ.టి.పాపిరెడ్డి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.సైదా సుల్తానా, వైస్ ప్రిన్సిపాల్ డా.రామ్ షెపర్డ్, బీనవేణి, ఓయూ ఎగ్జామ్స్ కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు, కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ధర్మతేజ, డాక్టర్ విజయేందర్‌రెడ్డి, డాక్టర్ వేల్పుల కుమార్, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ శ్రీధర్‌కుమార్, డాక్టర్ సాధు రాజేష్ పాల్గొన్నారు.

## నైతికత, స్వేచ్ఛపై నెలరోజులు అవగాహన

పంజాగుట్ట, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): దేశంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న హింసాత్మక ఘటనలకు సమాజంలో నైతిక విలువలు లోపించడమే కారణమని జమాతే ఇస్లామీ హింద్ మహిళా విభాగం ఆందోళన వ్యక్తం చేసింది. నైతిక విలువలను పెంపొందించేందుకు నెల రోజులపాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు క్యాంపెయిన్ కన్వీనర్ డాక్టర్ అస్రా ముహ్సినా తెలిపారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రచారానికి సంబంధించిన పోస్టర్‌ను మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖతీజా మెహ్వీన్, ప్రతినిధులు సాజిదాబేగం, ఇష్రత్ భానుతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, జన సమూహాలు అధికంగా ఉండే ప్రదేశాల్లో 'నైతికతే నిజమైన స్వేచ్ఛ' అనే అంశంపై నెల రోజులపాటు అవగాహన, ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జమాతే ఇస్లామీ హింద్ మహిళా విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.



బోయిన్‌పల్లి రాజరాజేశ్వరి గార్డెన్స్‌లో జైన్ సాధ్వి శివమాలాజీ ఆశీస్సులు తీసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీగణేష్, జంపన ప్రతాప్, ప్రకాష్ భాటియా

## జైనులను ఆదర్శంగా తీసుకోవాలి

- ఎమ్మెల్యే శ్రీగణేష్

బోయిన్‌పల్లి, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలను ఆదుకోవడం, ఆపదలోఉన్న వారికి సహకరించడంలో జైనులు ముందుంటారని వారిని ఆదర్శంగా తీసుకోవాలని కంటోన్మెట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. సికింద్రాబాద్ జైనసమాజ్ ఆధ్వర్యంలో బోయిన్‌పల్లి రాజరాజేశ్వరి గార్డెన్స్‌లో శ్రీ జైన్ శ్వేతాంబర్ తెరపంతి సభ మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సభలో జైనులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ఈ ప్రాంగణం కిటకిటలాడింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే శ్రీగణేష్, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్, ప్రకాష్ భాటియా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జైన్ మహాపర్ సన్నిధిలో జైన్ సాధ్వి శివ మాలాజీ ఆశీస్సులను పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైన్ సమాజ్ ప్రజలకు తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో జైన్ శ్వేతాంబర్ తెరపంతి సభ అధ్యక్షుడు సుశీల్ సంచితి, ప్రధాన కార్యదర్శి హేమంత్ సంచితి, బాబులాల్ బెయిన్, సురేష్ సురాన, ముఖేష్ శూరుడియా, అభినందన్ నహట, అనిల్ దుగ్గట్, ప్రకాష్ బంటియా, విమల్ పుకల్య, బాబూలాల్ బెంగిసీ, లక్ష్మిపాత్ బైత్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ సునీత

## అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు

చిలకలగూడ, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత మంగళవారం డివిజన్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎడ తెరిపి లేని వర్షాలకు డయేరియా, ఫ్లూ వంటి వ్యాధులు ప్రబలే అవకాశముందని వైద్య సిబ్బంది అప్రమత్తంగా వుండి సేవలు అందించాలని సూచించారు. సమావేశంలో డాక్టర్ జాన్, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

చిలకలగూడ, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని నేషనల్ కోఆర్డినేటర్స్ ఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎస్. శ్రీధర్ కోరారు. ఏకీకృత పెన్షన్ విధానం(యూపీయస్) లోప భూయిష్టంగా వుందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, పబ్లిక్ సెక్టార్ ఉద్యోగులు పాత పెన్షన్ పద్ధతి ప్రకారం పెన్షన్ చెల్లించాలని పోరాటం చేస్తున్నారని తెలిపారు. ఉద్యోగుల జీతాల నుంచి వసూలు చేసిన డబ్బు స్టాక్ మార్కెట్‌లలో పెట్టుబడులుగా పెట్టడం ఎంత వరకు సమంజసయని ప్రశ్నించారు. ఉద్యోగ, కార్మిక పోరాటాలకు అసోసియేషన్ మద్దతుగా నిలుస్తుందని, సెప్టెంబర్ 13న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమమంలో పాల్గొని యూపీయస్‌పై చర్చించనున్నట్లు తెలిపారు.

## గణేశ్ ఉత్సవాలకు ఆటంకాలు కలగకూడదు

సికింద్రాబాద్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): రాబోయే గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు కంటోన్మెంట్‌లో ఎలాంటి ఇబ్బందులు కలగకూడదని సికింద్రాబాద్ కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ అన్నారు. మంగళవారం కంటోన్మెంట్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించిన ఆయన గణేశ్ మండపాల నిర్వాహకులు, యువజన సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. గణేశ్ ఉత్సవాల కోసం అన్ని రకాల అనుమతులు తీసుకుని వైభవంగా జరుపుకోవాలని వారికి సూచించారు. కార్ఖాన ప్రధాన రహదారిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీని పరిశీలించి, తక్షణమే దానిని బాగు చేయాలని, లేదంటే నిమజ్జనం రోజున ఆటంకాలు కలుగుతాయని అధికారులకు ఆయన సూచించారు.



జూపాక సుభద్రను సత్కరిస్తున్న రమణాచారి తదితరులు

## జూపాక సుభద్రకు శ్రీకళానికేతన్ పురస్కారం

**రవీంద్రభారతి, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి):** కవయిత్రిగా, రచయిత్రిగా సమాజాన్ని ప్రభావితం చేసిన జూపాక సుభద్ర అభినందనీయురాలని ఐఏఎస్ విశ్రాంత అధికారి డా. కేవీ.రమణాచారి అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో శ్రీకళానికేతన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో 60 వసంతాల వజ్రోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవయిత్రి, వ్యాసకర్త, కాలమిస్టు, సంఘసేవకురాలు జూపాక సుభద్రకు కొసనం సుధాకర్ శ్రీకళానికేతన్ సాహిత్య పురస్కారం ప్రదానం చేశారు. రమణాచారి మాట్లాడుతూ.. సుభద్రను సత్కరించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఆమె రచనలతోనే కాకుండా వృత్తిపరంగా మంచి పేరు సంపాదించుకున్నారని కొనియాడారు. శ్రీకళానికేతన్ ఆధ్వర్యంలో సాహిత్య కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆర్. అనంత పద్మనాభరావు, డా. శ్రీనివాస్‌రెడ్డి, కోయి కోటేశ్వరరావు, దైవజ్ఞశర్మ తదితరులు పాల్గొన్నారు. సభకు ముందు ప్రదర్శించిన మూల్యం నాటిక ప్రేక్షకులను రంజింపజేసింది.

## ఆభరణాలు తీసుకుని డబ్బు ఎగవేత

**బంజారాహిల్స్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి):** లక్షల రూపాయలు విలువ చేసే ఆభరణాలు తీసుకొని డబ్బు ఇవ్వకుండా ఇల్లు ఖాళీ చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్.2లో తిబారుమల్ జువెల్స్ ప్రతినిధి సందీప్ అగర్వాల్‌కు కొద్ది రోజుల క్రితం ఓ వ్యక్తి ఫోన్ చేసి దుకాణానికి వచ్చే వినియోగదారుల పేర్లు చెప్పాడు. తనకు నగలు కావాలని, డిజైన్‌లను వాట్సాప్‌లో పంపించాలని కోరాడు. సందీప్ కొన్ని ఫొటోలు పంపాడు. వాటిలో గోల్డ్ కాయిన్ హారం, లక్ష్మీపికాక్ రూబీ హారం, నక్షీ నెక్లెస్‌ను ఎంపిక చేసుకున్నాడు. వీటి విలువ రూ. 29.35 లక్షలు. తాను ఉంటున్న నార్సింగ్‌లోని రాజ్ పుష్పా ఎటెర్నియా విల్లాకు పంపిస్తే చెక్కు ఇస్తానని చెప్పాడు. ఈ మేరకు సందీప్ నగలు పంపించగా అతడు రెండు చెక్కులు ఇచ్చాడు. మరుసటి రోజు సదరు వ్యక్తి ఫోన్ చేసి బ్యాంక్‌లో బ్యాలెన్స్ లేదు. రెండు రోజులు తర్వాత జమ చేయాలని చెప్పాడు. ఇలా వాయిదా వేస్తూ వస్తున్నాడు.

సందీప్ ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. అనుమానం వచ్చి రాజ్ పుష్పా ఎటెర్నియాకు వెళ్లి వాకబు చేయగా విల్లాను ఖాళీ చేసినట్టు తెలిసింది. మోసపోయినట్టు గ్రహించిన సందీప్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## శుభకార్యానికి వెళ్లొచ్చే సరికి రూ. 14 లక్షలు చోరీ

**జీడిమెట్ల, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి):** శుభకార్యానికి వెళ్లివచ్చేసరికి దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి రూ. 14 లక్షల చోరీ చేశారు. జీడిమెట్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన హనుమాన్‌రామ్ కుత్బుల్లాపూర్ గ్రామంలో స్టీల్ దుకాణం నిర్వహిస్తున్నాడు. దుకాణం పై అంతస్థులో నివసిస్తున్నాడు. గత శనివారం బెంగళూరులో ఉంటున్న సోదరి ఇంట్లో శుభకార్యానికి కుటుంబ సమేతంగా వెళ్లాడు. మంగళవారం ఇంటికి తిరిగి రాగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో భద్రపరిచిన రూ. 14 లక్షలు కనిపించలేదు. చోరీ అయ్యాయని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | ఎం.డి. రఫీక్ : 99854 00084, జి.అంజయ్య: 9985921364